అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక -331 మంగళవారం 7 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# హామీలు నెరవేరుస్తున్నాం

## రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

మేం పాలకులం కాదు..ప్రజా సేవకులం

ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం


ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం

బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి

తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే

: పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి





**ఆదిలాబాద్ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురావడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం చేయించారు. అనంతరం రూ.1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు**మిగతా 2లో...**

## ఆంధ్రప్రదేశ్ రాజధానిగా

# అమరావతి

## గెజిట్ విడుదల చేసిన కేంద్రం

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత

కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ

2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు వెల్లడి


2లో.


# ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

ఇరాన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవచ్చు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఇరాన్‌లో చిక్కుకున్న రెండో అమెరికా పైలట్‌ను రక్షించిన సైన్యం

155 విమానాలతో చారిత్రాత్మక రెస్క్యూ ఆపరేషన్ నిర్వహణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఒక్క రాత్రిలోనే ఇరాన్ దేశాన్ని పూర్తిగా తుడిచిపెట్టగలమని, ఆ రాత్రి రేపే కావచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో కూలిపోయిన అమెరికా ఎఫ్-15 విమాన సిబ్బందిలో రెండో వ్యక్తిని **మిగతా 2లో...**



# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరి-శిక్ష...

మధురై కోర్టు సంచలన తీర్పు

సాతంకుళం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు



# హామీలను అమలు చేసిన ఘనత మాది

## పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం

## మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క

**ఆదిలాబాద్, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు.

పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల **మిగతా 2లో...**



# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

భూమి నుంచి రికార్డు దూరంలో

1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం

10న పసిఫిక్ మహాసముద్రంలో

ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు



# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు అమలు దిశగా అడుగులు

## పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు**మిగతా 2లో...**



# డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త టెస్ట్!


2లో.

# ఆదిలబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు

పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి


2లో.

# ఆదిలబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

**తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**

**బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి**

**ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన**

**త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు**

**పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి**

**జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు**

**పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి**



**ఆదిలాబాద్ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్భందాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులు గా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్భంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై

పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త టెస్ట్!

**లెర్నింగ్ లైసెన్స్‌కు ముందు ఆన్‌లైన్ పరీక్ష .. దాంట్లో పాసైతేనే లెర్నింగ్, శాశ్వత లైసెన్స్**

**ప్రస్తుత రెండంచెల విధానం స్థానంలో మూడంచెల విధానం!**

**రోడ్డు ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రవాణాశాఖ కసరత్తు**

**అధ్యయనానికి కమిటీ నియామకం**

**హైదరాబాద్, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా అతివేగం, నిర్లక్ష్యం, రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన లేకుండా వాహనాలు నడుపుతుండటం వల్ల జరుగుతున్నవే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య లక్షకుపైగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో, యాక్సిడెంట్ల నివారణకు వీలుగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్సు జారీలో మూడంచెల విధానం అమల్లోకి తేవాలని భావిస్తోంది. సాధ్యాసాధ్యాల్ని పరిశీలించి సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించేందుకు రవాణాశాఖలో వివిధ విభాగాల నుంచి ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసారు. కమిటీ నివేదిక ఈ నెలాఖరుకు వచ్చే అవకాశం ఉంది. నివేదిక అందిన తర్వాత అన్ని అంశాల్ని పరిశీలించి వీలైనంత త్వరగా నూతన విధానం అమలు చేసేందుకు రవాణా శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

**ఇంటి నుంచే ఆన్‌లైన్ టెస్ట్‌కు హాజరుకావచ్చు**

డ్రైవింగ్ లైసెన్సు జారీలో ప్రస్తుతం రెండంచెల విధానం అమల్లో ఉంది. తొలుత లెర్నర్స్ లైసెన్సు రిజిస్ట్రేషన్ (ఎల్ఎల్ఆర్) పరీక్ష, ఆ తర్వాత ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్ష నిర్వహించి శాశ్వత లైసెన్సు మంజూరు చేస్తున్నారు. వీటికి తోడుగా కొత్తగా ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్స్ టెస్ట్ పేరుతో మూడో దశను కూడా ప్రవేశపెట్టనున్నారు. నూతన విధానం అమల్లోకి వస్తే... ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకునే ముందే.. ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్ టెస్ట్‌లో పాస్ కావాల్సి ఉంటుంది. ఈ పరీక్ష రహదారి భద్రతకు సంబంధించిన పలు అంశాలతో కూడి ఉంటుంది. ఆన్‌లైన్ టెస్ట్ కాబట్టి.. ఇంటి నుంచే హాజరుకావచ్చు. దీనిలో పాసైతే ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకుని, ఆ తర్వాత శాశ్వత లైసెన్సు తీసుకోవాలి. రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్స్ టెస్ట్‌లో ఏయే అంశాలను చేర్చాలి, ఎంత సమయం ఆ పరీక్ష నిర్వహించాలి అన్నదానిపై అధ్యయనం జరుగుతోందని, కమిటీ నివేదిక తర్వాత స్పష్టత వస్తుందని రవాణాశాఖ అధికారులు తెలియజేశారు. రోడ్డు ప్రమాదం వల్ల జరిగే నష్టాలు, బాధిత కుటుంబాల ఆవేదన, వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలపై వీడియో క్లిప్పింగ్స్ చూపించి వాటి ఆధారంగా టెస్ట్ ఉండేలా చూస్తున్నామని ఒక అధికారి వెల్లడించారు.

# హామీలు నెరవేరుస్తున్నాం

.మొదటిపేజీ తరువాయి



పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ.5,400 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2


**భూమి నుంచి రికార్డు దూరంలో**

**1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం**

**10న పసిఫిక్ మహాసముద్రంలో**

**ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు**

**న్యూయార్క్:** అమెరికా అంతరిక్ష సంస్థ–నాసా చేపట్టిన ఆర్టెమిస్–2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం. ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.



# ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి... గెజిట్ విడుదల చేసిన కేంద్రం

**ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి చట్టబద్ధత ఏర్పడింది. అమరావతిని ఏపీ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం నేడు అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించినట్లయింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అమరావతి రాజధాని సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పార్లమెంటుకు పంపిన విషయం తెలిసిందే. అక్కడ లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఈ బిల్లుకు ఆమోదం తెలిపాయి. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయడంతో, దీనికి అధికారిక ముద్ర పడింది. ఈ ప్రక్రియలన్నీ పూర్తవడంతో కేంద్ర న్యాయశాఖ తుది నోటిఫికేషన్ జారీ చేసింది.

2014 నాటి సీఆర్డీయే చట్టంలో పొందుపరిచిన అమరావతిని రాజధానిగా నోటిఫై చేస్తున్నట్లు ఇందులో స్పష్టం చేసింది. ఈ సవరణ చట్టం 2024 జూన్ 2వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లుగా (retrospective effect) గెజిట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 5, సబ్–సెక్షన్ (2)లో ఉన్న "కొత్త రాజధాని ఉంటుంది" (a new capital) అనే పదబంధం స్థానంలో "అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది" (Amaravati shall be the new capital) అని మార్పు చేశారు. ఈ సవరణ ద్వారా 'అమరావతి' అనే పదానికి కూడా చట్టంలో స్పష్టత ఇచ్చారు. 'అమరావతి' అనగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (జ=ణూ) చట్టం, 2014 నిబంధనల ప్రకారం నోటిఫై చేయబడిన రాజధాని నగర ప్రాంతాలు అని వివరణ జోడించారు. రాష్ట్రపతి ఆమోదం, గెజిట్ ప్రచురణతో ఈ చట్ట సవరణ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చినట్లయింది.

# ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

మొదటిపేజీ తరువాయి

విజయవంతంగా రక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌ను 'దుష్టశక్తి'గా అభివర్ణించిన ట్రంప్, ఆ దేశ పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామంటూ గతంలో సోషల్ మీడియాలో చేసిన హెచ్చరికలను పునరుద్ఘాటించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను 'చారిత్రాత్మకం'గా అభివర్ణించిన ట్రంప్, అమెరికా సైన్యం ఏ ఒక్క అమెరికన్‌ను వెనుక వదిలిపెట్టదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 155 విమానాలు పాల్గొన్నాయని, వాటిలో 4 బాంబర్లు, 64 ఫైటర్ జెట్లు, 48 రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, 13 రెస్క్యూ విమానాలు ఉన్నాయని వివరించారు. వేలాది మంది ఇరాన్ సైనికులు గాలిస్తుండగా, వారిని తప్పుదోవ పట్టించేందుకు సైనికుడు వేరే ప్రాంతంలో ఉన్నాడనే భ్రమ కల్పించి ఈ ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. దాదాపు 48 గంటల పాటు ఇరాన్ దళాలకు చిక్కకుండా ఆ 'వీర సైనికుడు' తప్పించుకు తిరిగాడని ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, రక్తం కారుతున్నా ఆ సైనికుడు కొండచరియలు ఎక్కి తన లొకేషన్‌ను చేరవేశాడని ట్రంప్ చెప్పారు. ఆపరేషన్ అనంతరం వెనుక వదిలేసిన తమ విమానాల్లోని సాంకేతికత ఇరాన్‌కు చిక్కకుండా ఉండేందుకు, వాటిని పూర్తిగా పేల్చివేసినట్టు ట్రంప్ వెల్లడించారు.

అయితే, ఈ రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని కొన్ని మీడియా సంస్థలు ముందుగానే లీక్ చేయడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీక్ వల్ల అమెరికా సైనికుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిందని ఆరోపించారు. "ఇది చాలా దారుణం. ఈ లీక్‌కు కారణమైన వ్యక్తిని మేం కచ్చితంగా పట్టుకుంటాం. వార్తను ప్రచురించిన మీడియా సంస్థ వద్దకు వెళ్లి, జాతీయ భద్రత దృష్ట్యా సోర్స్‌ను అప్పగించమని కోరతాం, లేదంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది" అని ట్రంప్ నేరుగా హెచ్చరించారు.

# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష... మధురై కోర్టు సంచలన తీర్పు



**మధురై ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు. కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్–19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్టు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి. పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ.1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# హామీలను అమలు చేసిన ఘనత మాది

.మొదటిపేజీ తరువాయి

కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.

-------

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు అమలు దిశగా అడుగులు

.మొదటిపేజీ తరువాయి

33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం అని ప్రధాని మోదీ అన్నారు. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని భావించారని, కానీ రద్దు చేసి చూపించామని అన్నారు. అలాగే, ఎన్డీయే కూటమి కూడా 25 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.

# బలమైన భారత్ నిర్మాణమే లక్ష్యం: బీజేపీ నాయకులు




**భీమదేవరపల్లి/ఏప్రిల్6 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ కేంద్రంలో బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ పార్టీ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. పేదల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. పార్టీ స్థాపకుల త్యాగాలను స్మరించుకుంటూ, కార్యకర్తలు మరింత సేవాభావంతో ప్రజల్లో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి పార్టీ భావజాలాన్ని తీసుకెళ్లి బలమైన భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, కొత్తకొండ సర్పంచ్ రమా రమేష్, నాయకులు ఊస కోయిల కిషన్, శనిగరపు ఐలయ్య, గుండెల్లి సదానందం, దొంగల వేణు, చిదూరాల రమేష్, దుర్గా సింగ్, దొంగల రాణా ప్రతాప్, బొజ్జపురి పృథ్వీరాజ్, మహిళా నాయకురాలు అంబీర్ కవిత, బొల్లంపల్లి శ్యామ్, సాయి, రచ్చ జ్ఞానేశ్వర్, సింగం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించి 46 సంవత్సరాలు పూర్తి చేసుకుని 47వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా ధర్మసాగర్ మండలంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు భైరపాక కుమార్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. ధర్మపురం, మల్లకపల్లి గ్రామాల్లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కో-కన్వీనర్ పెరుమాండ్ల అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ 1980లో అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ నాయకత్వంలో పేద ప్రజల అభ్యున్నతి, అట్టడుగు వర్గాల శ్రేయస్సు లక్ష్యంగా బీజేపీ ఆవిర్భవించిందన్నారు. కార్యకర్తల త్యాగాలతో పార్టీ నేడు దేశంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగి, ఎన్డీఏ పాలనలో అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు. రెండు ఎంపీ స్థానాల నుంచి 300కు పైగా స్థానాలు గెలిచి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిందని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం



ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదుగుతోందన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల్లో ఇంధన ధరలు పెరుగుతున్నా దేశంలో ధరలు స్థిరంగా ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మండలంలోని తాటికాయల, ధర్మపురం, మల్లకపల్లి, ఎలుకుర్తి, కరుణాపురం తదితర గ్రామాల్లో కూడా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బొజ్జపెల్లి సుభాష్, జనగామ జిల్లా కో-కన్వీనర్ పెరుమాండ్ల అమరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు



నిమ్మ సుదర్శన్ రెడ్డి, నాగవెళ్ళి యుగేందర్, గంకిడి వెంకట్ రెడ్డి, గాజుల సంపత్, దుస్సా రాములు, మండల ప్రధాన కార్యదర్శులు సందీప్, శివప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రాల శ్రీనివాస్, రాజేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్యామ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అనిరుధ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పెసరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాంత నిబద్ధతతోనే బీజేపీ ఎదుగుదల

## : రాణా ప్రతాప్ రెడ్డి


**నర్సంపేట,/ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** సిద్ధాంత నిబద్ధతతో క్రియాశీల రాజకీయాలు నడిపిస్తూ ప్రజల మన్ననలు పొందిన పార్టీగా భారతీయ జనతా పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు.
నర్సంపేట నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న దేశ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణతో పాటు అంత్యోదయ సిద్ధాంతంతో ఆవిర్భవించిన బీజేపీ, అవినీతి రహిత



పారదర్శక పాలనతో దేశ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వేసిన సుపరిపాలన బాటలో, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందని పేర్కొన్నారు.
'వికసిత్ భారత్' లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో యువత, మహిళలు, రైతులు సహా అన్ని వర్గాల మద్దతుతో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, నర్సంపేట నియోజకవర్గంలో కూడా బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వడ్డేపల్లి నరసింహారాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ జూలూరు రోజారాణి, సీనియర్ నాయకులు గడ్డం ఆంజనేయులు, కుంభం కోమల్ రెడ్డి, బాల్నే జగన్, దుగ్యాల సమ్మయ్య, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, ఉపాధ్యక్షుడు కొంకీసా విగ్నేష్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాళాలు వేసిన ఇళ్లపై దొంగల దాడి

## రాయపర్తిలో బీభత్సం - బంగారం, నగదు దోపిడి

**రాయపర్తి,/ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మైలారం, శివరామపురం గ్రామాలలో ఆదివారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడి గ్రామస్తుల్లో భయాందోళనలకు గురిచేశారు. మైలారం గ్రామానికి చెందిన ఎలసోజు యాదవ చారి ఇంట్లోకి చొరబడి సుమారు ఒక తులం బంగారం, రూ.25 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. యాదవ చారి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో తన కొడుకు వద్దకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కిటికీ తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువా పగులగొట్టి దోపిడీకి పాల్పడ్డారు. ఈ విషయాన్ని గమనించిన పొరుగువారు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకున్న యాదవ చారి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే శివరామపురం గ్రామానికి చెందిన మారుపల్లి రామిరెడ్డి ఇంట్లోనూ దొంగలు చొరబడి ఒక తులం బంగారం, రెండు వెండి ఉంగరాలు, రూ.25 వేల నగదును దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ముత్యం రాజేందర్ క్లూస్ టీమ్‌తో కలిసి ఘటన స్థలాలకు చేరుకుని ఆధారాలు సేకరించారు. దొంగతనాలకు పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ వరుస దొంగతనాలతో గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రాత్రి పహారా బలపర్చాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.

# ముల్కనూరు శివారులో పేకాట..

## ముగ్గురు పట్టుబడగా ఇద్దరు పరార్

**భీమదేవరపల్లి/ఏప్రిల్6 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ముల్కనూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సోమవారం పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంటాడి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన వారు అలుగు సుమన్, ఇట్టబోయిన లవణ్, సిగసారపు సురేష్‌గా గుర్తించారు. పరారైన వారు గికూరు సతీష్, పోలవేణి మణికంఠగా తెలిసింది. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.4,230 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనపరచుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

# పెనుబల్లిలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**పెనుబల్లి/, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** పెనుబల్లి మండలంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్ రావు హాజరై, బీజేపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు అంచలంచెలుగా ఎదిగిన ప్రస్థానాన్ని వివరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి గాయం నాగరాజు, ఉపాధ్యక్షులు వంగాల సత్యనారాయణ రెడ్డి, పేర్ల మహేష్, చెక్కిలాల మంగేశ్వరరావు, కాటిన శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వీఎం బంజర్, లంకపల్లి, ఏరుగట్ల, మండలపాడు గ్రామాల్లో బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.

# జాబ్ మేళా గోడపత్రిక ఆవిష్కరణ

## విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




**నర్సంపేట, /ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా గోడపత్రికను ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సంపేట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ వి. పూర్ణచందర్ పాల్గొన్నారు. గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం ప్రొఫెసర్ నవీన్ మాట్లాడుతూ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చదువుతూనే అప్రెంటిస్ అవకాశాలను విద్యార్థులు పొందవచ్చని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని, జాబ్ మేళా వంటి కార్యక్రమాలు వారికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, స్టాఫ్ సెక్రటరీ ఎం.ఎం. రహీముద్దీన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి నియోజకవర్గంలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**సత్తుపల్లి/, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు బానోతు విజయ్ ఆధ్వర్యంలో సత్తుపల్లి కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేసి వేడుకలు జరిపారు. అదే విధంగా రూరల్ మండల అధ్యక్షుడు శాలి శివ ఆధ్వర్యంలో రెజర్ల, కిష్టపురం, పాకలగూడెం, కాకర్లపల్లి, గంగారం తదితర గ్రామాల్లో 'మన ఊరుమన జెండా' కార్యక్రమం నిర్వహించి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మిఠాయిలు పంచి సంబరాలు జరిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాయుడు రాఘవరావు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి స్థాయి వరకు ఎదిగిన ప్రస్థానాన్ని వివరించారు. దేశంలో కేవలం రెండు స్థానాలతో ప్రారంభమైన పార్టీ, నేడు అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, భాస్కర్ల వీరంరాజు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వం నుంచి నేటి నరేంద్ర మోదీ నాయకత్వం వరకు దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం డీబీటీ విధానంతో చివరి స్థాయి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నదని తెలిపారు. తెలంగాణలో కూడా త్వరలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మీనారాయణ, బూత్ అధ్యక్షులు రామారావు, షేక్ శుభాని, రామకృష్ణ, భాస్కరరావు, సత్యనారాయణరెడ్డి, పమ్మి నరసింహారావు, సాలి కృష్ణస్వామి, వసంతరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆచంట నాగస్వామి, సీనియర్ నాయకులు మన్నేని నరసింహమూర్తి, ఆచంట సుబ్రమణ్యం, పట్టణ ప్రధాన కార్యదర్శులు మందా శివ, నాగ మౌనిక, తుర్లపాటి సాయిచంద్ర, విశ్వనాధుల వంశీకృష్ణచారి, మెరుగు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలం ముందే పనులు పూర్తి చేయాలి





**సత్తుపల్లి,/ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రిహన కమల్ పాషా అధికారులను ఆదేశించారు. సోమవారం 18, 23వ వార్డుల్లో జరుగుతున్న పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులు, మురుగు కాలువల శుభ్రత కార్యక్రమాలను పరిశీలించిన చైర్‌పర్సన్, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజీల్లో పూడికతీత పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మానస రాము, విరివాడ అపర్ణ నాగభూషణం, మున్సిపల్ కమిషనర్, ఏఈలు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గీసుగొండలో రోడ్డు ప్రమాదం -వ్యక్తి మృతి



**గీసుగొండ/ఏప్రిల్ 6(జర్నలిస్ట్ వార్త):** అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. మండల పరిధిలోని హర్జా తండా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్‌లోని పురాణాపూల్ ప్రాంతానికి చెందిన భూక్య రవి (36) వృత్తిరీత్యా డ్రైవర్. సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై గ్రామానికి వచ్చి, తిరిగి ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో హర్జా తండాలోని ఓంకార్ స్తూపం మలుపు వద్దకు చేరుకోగా, వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనం అతివేగంగా వచ్చి రవి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడైన టాటా ఏసీ డ్రైవర్ పొన్నం వంశీ (దుగ్గొండి మండలం, రేకంపల్లి) అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి తమ్ముడు భూక్య కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజారోగ్యంపై వాకథాన్

## జెండా ఊపిన మంత్రి దామోదర




**హైదరాబాద్ ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు పీవీ మార్గ్ జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు ఏర్పాటు చేసిన వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో పాల్గొన్న వారితో కలిసి మంత్రి జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు నడిచారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, హైదరాబాద్ పోలిస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ వారం రోజుల పాటు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.

# బీసీ ఆజాది ఫెడరేషన్ హుస్నాబాద్ అధ్యక్షుడిగా సాయి చంద్ర



**భీమదేవరపల్లి/ఏప్రిల్6 (జర్నలిస్ట్ వార్త):** హుస్నాబాద్ నియోజకవర్గ బీసీ ఆజాది ఫెడరేషన్ అధ్యక్షుడిగా భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లి గ్రామానికి చెందిన ముప్పు సాయి చంద్రను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నియామకం బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ ఆదేశాల మేరకు జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుడికాల భాస్కర్ మాట్లాడుతూ, జక్కని సంజయ్ కుమార్ నాయకత్వంలో బీసీల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం మరియు సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి గ్రామంలో బీసీ ఆజాది ఫెడరేషన్‌ను బలోపేతం చేయాలని, బీసీల పోరాటాన్ని మరింత శక్తివంతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ముప్పు సాయి చంద్ర మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బీసీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్, శివ కుమార్, శంకర్, మణికంఠ, లిటిల్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం కావాలి

## : రాజారపు రత్నం పిలుపు




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** దళిత హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని డిహెచ్‌పీఎస్ (దళిత హక్కుల పోరాట సమితి) జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో రాజారపు దేవయ్య అధ్యక్షతన డిహెచ్‌పీఎస్ రెండో మహాసభల వాల్ పోస్టర్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజారపు రత్నం మాట్లాడుతూ, ఏప్రిల్ 17, 18 తేదీలలో వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్, పోచమ్మ మైదానంలో జరగనున్న మహాసభలు మరియు బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిచినా దళితులు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి, కుల నిర్మూలన వంటి లక్ష్యాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ హక్కులు గత కొన్నేళ్లుగా అమలులోబలహీనపడుతున్నాయని అన్నారు. సరళీకరణ ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలు తగ్గిపోవడం, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ విధానాలు పెరగడం వల్ల రిజర్వేషన్ల ఉనికి నామమాత్రంగా మారుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట నాగరాజు, కొత్తపెల్లి బిక్షపతి, రాజారపు సురేష్, జిట్ట కుమారస్వామి, కొత్తపెల్లి ఏలియా, బొడిగ కమలాకర్, రాజారపు శీను, సదానందం, హుస్సేన్, ప్రభాకర్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

## : విజయశాంతి హామీ






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త)** భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను రాష్ట్ర శాసనసభలో ప్రస్తావించి న్యాయం చేయడానికి కృషి చేస్తానని శాసన మండలి సభ్యురాలు విజయశాంతి హామీ ఇచ్చారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి నిన్న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, జనగామ జిల్లా మహాసభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కార్మికుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జనగామ జిల్లాలో ఈ నెల 7వ తేదీన జరగనున్న జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరగా, వీలైతే తప్పకుండా హాజరవుతానని విజయశాంతి తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ, మనుషుల కోసం అద్భుతమైన భవనాలు నిర్మించే కార్మికులకే కనీస నివాస సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్రమిస్తూ నిర్మించే భవనాలే మన సృష్టి అయినప్పటికీ, కార్మికుల జీవన స్థితి మాత్రం దయనీయంగా ఉందన్నారు. గత 20 సంవత్సరాలుగా సాగుతున్న ఉద్యమ పోరాటాల ఫలితంగా 1996 చట్టం అమలులోకి వచ్చినప్పటికీ, కార్మికుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో ఫలితాలు దక్కలేదని విమర్శించారు. ముఖ్యంగా గత పదేళ్ల పాలనలో ఆ చట్టం నిర్వీర్యం చేయబడిందని ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడంతో కార్మికులలో ఆశలు చిగురించాయని, నిర్వీర్యమైన చట్టాన్ని పునరుద్ధరించి సమగ్రంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల గోడును అసెంబ్లీలో వినిపించాలని విజయశాంతిని కోరారు. దీనికి స్పందించిన ఆమె, భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రసమల్ల కొమురయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు తుడి అంజయ్య, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గిన్నారపు రవి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం జాతి ప్రయోజనమే.. పోరుబాటలో వెనకడుగు లేదు.



## సుప్రీం తీర్పుపై మందకృష్ణ ధ్వజం.. పూజారి వ్యవస్థపై వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం

**హైదరాబాద్, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** దశాబ్దాల సుదీర్ఘ పోరాటం.రాజీపడని నైజం. అణగారిన వర్గాల గొంతుకగా నిలవడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఎస్సీ వర్గీకరణ సాధనే శ్వాసగా సాగుతున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులతో పాటు, దేవాలయాల్లో పూజారి వ్యవస్థపై ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి.రాజకీయాలకు అతీతంగా. అస్తిత్వ పోరాటం,చేయాల్సిన సమయం వచ్చిందని చెప్పకనే చెప్పారు.

నా భుజంపై ఉన్న నల్ల కండువా నా మరణం వరకు మారదఅని ప్రకటించిన మందకృష్ణ, తన రాజకీయ ప్రస్థానాన్ని కేవలం అధికారం కోసం కాకుండా జాతి ప్రయోజనాల కోసమేనని పునరుద్ఘాటించారు. గతంలో వైఎస్సార్, చంద్రబాబు, కేసీఆర్, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మన్ మోహన్ సింగ్, నుంచి నేటి ప్రధాని మోదీ వరకు ఆయన ఎవరిని కలిసినా. అది కేవలం ఎస్సీ వర్గీకరణ కోసమే తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేశారు. తనను విమర్శించి పదవులు పొందే వారికి తనపై వ్యాఖ్యలు చేసిన తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, తానుకూడా పట్టించుకోనని అన్నారు. కానీ మాదిగల అస్తిత్వం ప్రమాదంలో పడితే మాత్రం ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

దేవాలయాల గర్భాలయంలోకి అందరికీ ప్రవేశం ఎందుకు లేదు?

మందకృష్ణ తాజాగా సంధించిన విమర్శనాస్త్రం ఇప్పుడు సామాజిక



వర్గాల మధ్య వేడిని పెంచింది. హిందూ దేవాలయాల్లో కేవలం బ్రాహ్మణులే పూజారులుగా ఎందుకు ఉండాలని ఆయన ప్రశ్నించారు. భక్తులందరూ దేవుడి ముందు సమానమైనప్పుడు, గర్భాలయంలో పూజలు చేసే హక్కు అన్ని కులాల వారికి ఎందుకు ఉండదు? అన్ని కులాలకు అక్కడ సమాన వాటా ఉండాలి అన్నది ఆయన ప్రధాన డిమాండ్. ఈ వ్యాఖ్యలపై బ్రాహ్మణ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఆగమ శాస్త్రాలను, సనాతన ధర్మాన్ని కించపరిచే విధంగా ఆయన మాట్లాడుతున్నారని, సమాజంలో వైరుధ్యాలు పెంచవద్దని వారు కోరుతున్నారు. మందకృష్ణ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

సుప్రీం తీర్పు - దళిత క్రిస్టియన్ల అంశం

క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందన్న సుప్రీంకోర్టు తీర్పుపై మందకృష్ణ అసహనం వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛకు విరుద్ధమని, దళిత క్రిస్టియన్ల హక్కుల కోసం తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని కవచంగా చేసుకుని ఆయన సాగిస్తున్న ఈ ఉద్యమం, ఇప్పుడు కుల వ్యవస్థ పునాదులను ప్రశ్నిస్తోంది.

### తదుపరి అడుగు ఎటు?

మందకృష్ణ మాదిగ వైఖరి ఎప్పుడూ స్పష్టంగా ఉంటుంది. ఆయన ఒక వర్గానికి వ్యతిరేకి కాదని ఆయన అనుచర వర్గం వాదిస్తున్నప్పటికీ, ఆయన చేసే విమర్శలు ఇప్పుడు సంప్రదాయవాదులకు మింగుడు పడటం లేదు. మందకృష్ణ మాటలు రాజ్యాంగంలోని సమానత్వ సూత్రానికి అనుగుణంగా ఉన్నాయని సోషల్ మీడియాలో ఒక వర్గం మద్దతు తెలుపుతోంది. అణగారిన వర్గాలకు అన్యాయం జరిగిన ప్రతిచోటా ఎంఆర్పిఎస్ గళం వినిపిస్తూనే ఉంటుందని విషయం విదితమే ఐనప్పటికీ, బ్రాహ్మణ సంఘాల డిమాండ్ మేరకు ఆయన వెనక్కి తగ్గుతారా? లేదా ఈ అంశాన్ని మరింత ఉధృతం చేసి జాతీయ స్థాయిలో చర్చకు తెరలేపుతారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మందకృష్ణ సంధించిన ఈ బాణం కేవలం ఒక సామాజిక వర్గానికి వ్యతిరేకమైనదా. లేక సార్వత్రిక సమానత్వం కోసమా అన్నది విజ్ఞుల చర్చకు వదిలేయాల్సిన అంశం.

# సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే

**ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ధ విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతబడిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సివస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండాకాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించాలి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజవాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సిపిఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యస్థ కూడా బలపడుతుంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పోరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడ రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా-గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్లు ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజవాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధర రూ.300- 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం. కెజి బేసిన్‌లో చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అవసరమైతే అసెంబ్లీ తీర్మానించాలి. ఈ విషయంలో అఖిలపక్షంలో చర్చించాలి. గతంలోకి వెళితే కృష్ణా-గోదావరి డి6 బేసిన్ ను రిలయన్స్ ఇండిస్ట్రీస్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధం గా కేటాయించాయి. భూగర్భ నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ విషయాన్ని గురించి పెట్రోలియం మంత్రిత్వ శాఖను నిలదీసింది. కనుక ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్ సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. దీనిని చంద్రబాబు లేవనెత్తడం మంచిది. కేంద్రంలో అధికారం పంచుకుంటున్న చంద్రబాబు ఈ విషయంలో ఇప్పటికైనా డిమాండ్ ముందుకు తీసుకుని రావాలి. రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఎలాగూ ఇవ్వడం లేదు. విభజన సమస్యలు అలాగే ఉన్నాయి. అయితే చంద్రబాబు కోరిన వెంటనే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. అందువల్ల సహజ వాయువు విషయంలో ఒత్తిడి పెంచితే కేంద్రం దిగిరాక తప్పదు. ప్రజలు కూడా ఆందోళనలకు దిగితే తప్ప రాష్ట్రానికి చురుకు పుట్టదు.




## గ్యాస్ కొరతతో హోటల్ పరిశ్రమ కుదేలు

### వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి -ప్రైవేట్ హోటల్స్ అసోసియేయన్ విజ్ఞప్తి

**విజయవాడ, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు రాష్ట్రంలోని హాస్పిటాలిటీ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా స్టార్ హోటల్ విభాగంపై ప్రభావం చూపుతోందని ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు ఆష ప్రెసిడెంట్ ఆర్‌వి.స్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం గ్లోబల్ స్థాయిలో ఇంధన ధరలు పెరగడంతో పరిశ్రమ ఖర్చు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రవాణా, విద్యుదుత్పత్తి, సరఫరా వ్యవస్థలు, మొత్తం సేవల నిర్వహణ వ్యయాలు పెరిగాయని, దీనివల్ల స్టార్ హోటళ్లలో ఆపరేటింగ్ ఖర్చులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. ప్రధానంగా ఎల్‌పిజి సరఫరా అస్థిరత, ధరల పెరుగుదల తీవ్రమైన సమస్యగా మారిందని పేర్కొన్నారు. పలు హోటళ్లు సిలిండర్ రీఫిల్ ఆలస్యం, సరఫరా లోపాలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధన మార్గాలను అన్వేషించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అవి ఎక్కువ ఖర్చుతో కూడుకున్నవని, నిర్వహణ పరంగా సవాళ్లను కలిగిస్తున్నాయని తెలిపారు. కుకింగ్ ఆయిల్, రవాణా ఖర్చులు, ఇతర అవసరమైన సరుకుల ధరలు పెరగడం వల్ల మెనూ ధరలను 20 నుంచి 30 శాతం వరకు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అయినప్పటికీ, వినియోగదారుల సంతృప్తి, సేవా ప్రమాణాలను నిలబెట్టడానికి హోటళ్లు కొంతభాగాన్ని స్వయంగా భరించే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. నిరంతర ఖర్చు పెరుగుదల లాభాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు హోటళు పలు ఆపరేషనల్ చర్యలను చేపట్టాయని, వాటిలో వంట గది ప్రక్రియలను మెరుగుపరచడం, మెనూలను సరళీకరించడం, శక్తి వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితి పర్యాటక రంగంపై కూడా పరోక్ష ప్రభావాన్ని చూపుతోందని పేర్కొన్నారు. విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల ఎయిర్ ఫేర్‌లు అధికమయ్యాయని, దీనివల్ల కార్పొరేట్, లీజర్ ట్రావెల్‌లో కొంత జాగ్రత్త దృక్పథం కనిపిస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఆక్యుపెన్సీ స్థాయిలు స్థిరంగా ఉన్నప్పటికీ, పరిస్థితి ఇలాగే కొనసాగితే డిమాండ్ తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్టార్ హోటల్ రంగం ప్రస్తుతం ఉద్యోగులను కొనసాగిస్తోందని, దీర్ఘకాలికంగా ఈ పరిస్థితి కొనసాగితే ఉద్యోగ స్థిరత్వంపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఎల్‌పిజి, ధరల సమస్య ప్రస్తుతం హాస్పిటాలిటీ రంగాన్నీ ప్రభావితం చేస్తోన్న పేర్కొన్నారు. హోటల్ పరిశ్రమకు ఎల్‌పిజి సరఫరా నిరంతరంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ క్లిష్ట సమయంలో ఇన్‌పుట్ ఖర్చులను నియంత్రించేందుకు తగిన సహాయ చర్యలను చేపట్టాలని ఆషా విజ్ఞప్తి చేసింది. తక్షణ చర్యలు తీసుకుని పరిశ్రమ కాపాడాలని కోరారు.

## ఇజ్రాయెల్‌కు విమాన సర్వీసులు నిలిపివేత

### ఎయిర్ ఇండియా వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు వెళ్లే సర్వీసులను, అక్కడి నుండి వచ్చే అన్ని విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రయాణికులు, విమాన సిబ్బంది భద్రతను దష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. ఈ కాలంలో ప్రయాణానికి ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని, లేదా ఒకసారి ఉచితంగా ప్రయాణ తేదీని మార్చుకునే వెసులుబాటు కల్పిస్తామని ప్రకటిచింది. మే 31 తర్వాత అప్పటి పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

## చంద్రబాబు చేతిలో ఐదూళ్ల భవిష్యత్

**భద్రాచలం అభివృద్ధికి ఐదూళ్లే ముఖ్యం**

**మౌనంగా ఐదు మండలాలను కలుపుకున్న బాబు**

**మంత్రి తుమ్మల లేఖతో మరోమారు తెరపైకి సమస్య**



**భద్రాచలం ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):**
భద్రాచలం అభివృద్ధికి, నీటి మునక గండం నుంచి బయటపడడానికి ఇప్పుడు ఐదూళ్లు అవసరం గతంలో విభజన తరవాత ఏకపక్ష నిర్ణయంతో ఐదు మండలాలను ఎపిలో కలిపారు. భద్రాచలానికి ఆనుకొని ఉన్న 5 గ్రామాలను ఏపీ నుంచి వేరుచేసి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. గత కొన్నేళ్లుగా ఈ విషయంలో కేంద్రం నాన్చివేత ధోరణి అవలంబిస్తోంది. ఎపి ప్రభుత్వం కూడా అదే వైఖరితో ఉంది. ఐదు మండలాలను కలపడం వల్లనే పోలవరం సాధ్యం అయ్యిందని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఈ విషయంలో పట్టువిడుపులు ప్రకటించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తనకు ముఖ్యమని ప్రకటించిన చంద్రబాబు ఈ విషయంలో మాత్రం పెదవి విప్పడం లేదు. చంద్రబాబు తలచకుంటే ఈ సమస్య చిటికెలో పరిష్కారం అవుతుంది. పరిపాలన సౌలభ్యం కోసం ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేసి గిరిజనుల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిపిన యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలు పరిపాలనపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పదేపదే కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. తెలంగాణలోని రెండు భాగాల మధ్య ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాయి. మిగిలిన సరిహద్దులు గోదావరి నది, రిజర్వు ఫారెస్టు ప్రాంతాలతో చుట్టుముట్టు ఉన్నాయి. దీంతో పరిపాలనపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామ పంచాయతీలకు పోలవరం ముంపు సమస్యతో ఎలాంటి సంబంధం లేదు. కానీ పరిపాలన, జీవనోపాధి, ప్రజాసేవల కోసం ఆ గ్రామాల ప్రజలు భద్రాచలంపైనే పూర్తిగా ఆధారపడి ఉన్నారు. ఏపీలో కొనసాగటం వల్ల గత 12 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామాల్లోని గిరిజనులు తమ ఊళ్లను తెలంగాణలోనే కలపాలని ఎప్పటి నుంచో కోరుతున్నా, కేంద్రం కానీ, ఎపి కానీ పట్టించుకోవడం లేదు. ఇక, ఆ గ్రామాల ప్రజలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 282 కిమీల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకోసం 8 గంటల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. మరోపక్క, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రం కేవలం 40 కిమీల దూరంలో ఉన్నదని, గంటలో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ప్రస్తుత సరిహద్దుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, అవసరమైన సరుకులు తరలించేటప్పుడు తరుచుగా తనిఖీలు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్- ఒడిసా రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో పోలీసింగ్, శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తుతున్నదని ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం తెలంగాణలో ఉండగా,ఈ ఆలయానికి సంబంధించిన కొన్ని భూ ములు ప్రస్తుతం పురుషోత్తపట్నం ప్రాంతంలో ఉన్నాయి. ఈ దేవాలయ భూముల విషయంలో గతంలో అక్కడికి వెళ్లిన మహిళా ఇవోపై దాడి జరిగింది. ఇది శాంతిభద్రతల సమస్యగా మారింది. దేవాలయ నిర్వహణ సులభంగా ఉండేందుకు ఈ భూభాగాలను తిరిగి తెలంగాణలో కలపటం అత్యవసరం కూడా. ఈ భౌగోళిక సమస్య కొనసాగితే భద్రాచలం దేవాలయం అభివృద్ధి ప్రణాళికకు ఆటంకం ఏర్పడుతుందని ప్రభుత్వ వర్గాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాక, ఆ ఐదు గ్రామాలు ఐదో షెడ్యూలులో ఉండటంతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు గిరిజనులకు అందటం లేదని గిరిజన నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ ఐదు గ్రామ పంచాయతీలు, 19 రెవెన్యూ గ్రామాలు తిరిగి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి కలపాల్సిన అసవరం ఉఎంతైనా ఉందని. కేంద్ర మంత్రి అమిత్‌షాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16 నుంచి జరగబోతతున్నాయి. ఈ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన ఓ లేఖ రాశారు. ఆ ఐదు గ్రామాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదివరకే ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు కనుక నిర్ణయం తీసుకుంటే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. అందుకు ఆయన సానుకూలంగా ముందుకు రావాల్సి ఉంది.

## ఒంటిమిట్టలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

### వైభవంగా పుష్పయాగం నిర్వహణ



ఒంటిమిట్ట **ఏప్రిల్ 6 (జర్నలిస్ట్ వార్త):** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముంగింపుదశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా నిర్వహించిన పుష్పయాగం అత్యంత వైభవంగా సాగింది. ఆదివారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం భక్తి భరితంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, ఆలయ శుద్ధి, నిత్యారాధనలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజాలు, చామంతులు, గన్నేరు, సంపంగి, మొగలి దళం వంటి పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి సుమారు 3 టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి. ప్రకృతి వైపరీత్యాలు తొలగి భక్తులు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు పుష్పయాగం నిర్వహిస్తారు. అలాగే నిత్యకైంకర్యాలలో తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ యాగాన్ని చేస్తారని అర్చకులు తెలిపారు. ఈ యాగం ద్వారా దోషాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివ రావు, డిప్యూటీ ఈవో ప్రశాంతి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

